క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



నందిపేట్(ఆర్మూర్): పంటలను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం, మక్కలు, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే వరి, సోయా కోతలు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నా రు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె. గంగాధర్, దేవన్న, రాజలింగం, బైన చిన్న మల్లయ్య, దశరత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధరను పొందాలి

మాక్లూర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని రైతులు మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మండలంలోని డీకంపల్లి, రామస్వామి క్యాంపులలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం వారు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దినేష్, మండల సమైక్య ఏపీఎం ఉమా కిరణ్, సీసీ రాజా రమేష్, సీఏ అనిత, మహిళా సమైఖ్య అధ్యక్షురాలు మాధురి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

శివాలయంలో భక్తుల పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో భక్తులు అరుద్ర నక్షత్రం కావడంతో అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి బిల్వా పత్రాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. అలాగే భక్తులు రామాలయం, అయ్యప్ప ఆలయం, దుర్గామాత, హనుమాన్ ఆలయను సందర్శించారు. అనంతరం నందీశ్వర మహరాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, కొంత మంజుల, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి, సిద్ధుల గుట్ట సేవ సమితి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికారంతోనే ఆరోగ్యం



రెంజల్(బోధన్): గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో కమలాకర్, ఐసీడీఎస్ సీడీపీవో పద్మజలు పేర్కొన్నారు. సోమవారం రెంజల్‌లోని రైతు వేదికలో మండల స్థాయి పోషణ మాస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని వివరించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముర్రుపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ సౌజన్యతో పాటు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభం



బాల్కొండ: మండలంలోని నాగాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రీ ప్రైమరీ తరగతులను ఎంఈవో రాజేశ్వర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ తరగతులను మంజూరు చేసిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని సీఎం సూచించారన్నారు. పాఠశాలలకు ఒక ఇన్‌స్ట్రక్టర్, ఆయాలను కేటాయించామన్నారు. మధ్యాహ్న భోజనం, స్నాక్స్ చిన్నారులకు అందిస్తామన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణవేణి, హెచ్‌ఎం రవి కుమార్, గ్రామస్తులు వెంకటేశ్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఇందల్వాయి: ఇందల్వాయి పీఏసీఎస్ పరిధిలోని ఇందల్వాయి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో రాజేంద్రకుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ముందుకు సాగని పనులు

- స్థలం కేటాయించి మూడు నెలలు గడిచినా వేగవంతం కాని ముప్కాల్ పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు
- త్వరగా పూర్తి చేయాలని ప్రజల వినతి



నిలిచిన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు

బాల్కొండ: ముప్కాల్‌లో ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వ హయాం మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం రూ.1.43 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరై మూడేళ్ల తర్వాత స్థలం కొలిక్కి వచ్చింది. మూడు నెలలు గడుస్తున్న పనులు వేగవంతం కావడం లేదు. భవన నిర్మాణం కోసం పిల్లర్ల గుంతలు తవ్వారు. బోరు బావి తవ్వించారు. అంతే పనులు ముందుకు సాగడం లేదు. వర్షాలను బూచిగా చూపి కొన్నాళ్లుగా పనులు చేపట్టడం లేదు. ముప్కాల్ మండల ప్రజలు మెండోరా మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లోని పీహెచ్‌సీ కేంద్రానికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారు. పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం నిధుల ఇబ్బంది లేదు. గతంలోనే నిధులు మంజూరై సిద్ధంగా ఉన్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పనులను వేగవంతం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచిస్తున్నారు.

వేగవంతం చేస్తాం

పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ప్రారంభించాం, వర్షాలు కురవడంతో పనులు నిలిచి పోయాయి. పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేస్తాం. నిధులకు ఎలాంటి సమస్య లేదు. నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా పనులు చేపడుతాం.

– షరీఫ్, పీఆర్ఏఈ, బాల్కొండ

పోతంగల్‌లో రైతుల రాస్తారోకో



పోతంగల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

- రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

రుద్రూర్: రైతాంగ సమస్యలు పరిష్కారించాలని పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి తరలివచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రధాన రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రబీ సీజన్‌కు సంబంధించిన సన్న ధాన్యం బోనస్ వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. కౌలు రైతుకు రైతు భరోసా ఇవ్వాలని, రూ. రెండు లక్షలు రుణమాఫీ చేయాలని, భూమి లేని రైతులకు ఆత్మీయ భరోసా కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడారు. రైతులు ఆందోళన చేస్తున్న ప్రాంతానికి డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ ఆజీజ్ వచ్చి సమస్యను తెలుసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైతులు అందజేశారు. రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని బీజేపీ నాయకుల రాస్తారోకో



మోస్రాలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

వర్ని (మోస్రా): మోస్రా గోవూరు గ్రామాల మధ్య రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ నాయకులు మోస్రా మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. పనులు పూర్తి చేయకపోవడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆరోపించారు.

బాధితులకు వరం సీఎంఆర్ఎఫ్



కొత్తపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



లక్కోరలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్కొండ/వేల్పూర్ : బాధితులకు సీఎంఆర్ఎఫ్ వరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఇద్దరు బాధితులకు కలిపి మంజూరైన రూ. 34 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులు అందించారు.ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, కిసాన్‌ఖేత్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి, నాయకులు నర్సారెడ్డి, మహిపాల్, అమిత్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామంలో ముగ్గురు బాధితులకు కలిపి మంజూరైన రూ. 39 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కిషన్‌గౌడ్, నాయకులు రాటంసాగర్, సంజీవ్‌రెడ్డి, రంజిత్, నవీన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో ముగ్గురు బాధితులకు కలిపి మంజూరైన రూ. లక్షా ఇరవై తొమ్మిదివేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నాయకులు ఊట్నూరు సుభాష్, వేల్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ భైరి శ్రీధర్, నాయకులు చేపూర్ గంగాధర్, ముత్యం, ఆత్మారాం, ప్రవీణ్‌కుమార్, శివాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటగిరి వారీగా జాబితా రూపొందించాలి



కమ్మర్‌పల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను కేటగిరిల వారీగా జాబితాను రూపొందించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కమ్మర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను పరిశీలించారు. గ్రామాల వారీగా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా నివేదిక తయారు చేయాలని సూచించారు. అనంతరం రికార్డుల గదిని పరిశీలించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ శరత్, జీపీవోలు ఉన్నారు.

ఆర్టీసీ కార్మిక మాజీ నేత అద్దంకి ఉషాన్ సంతాప సభ



బోధన్: పట్టణంలోని ఆజాంగంజ్ ప్రాంతానికి చెందిన తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి, ఆర్టీసీ కార్మిక సంఘ మాజీ సీనియర్ నాయకుడు ఇటీవల అనారోగ్య సమస్యలతో కన్నుమూసిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన స్వగృహం ఆవరణలో అసోసియేషన్, కుటుంబ సభ్యుల అధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈవీఎస్ నారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు విచ్చేసి మాట్లాడారు. డివిజన్‌లో అసోసియేషన్ బలోపేతానికి అద్దంకి ఉషాన్ క్రియాశీలకంగా పని చేశారని, ఆయన సేవలు ఆదర్శనీయమన్నా రు. ముందుగా అద్దంకి ఉషాన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా, డివిజన్ ప్రతినిధులు సిర్ప లింగం, కృష్ణారావు, ప్రకాశం, జ్ఞానేశ్వర్, బాల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



గోవూరు వద్ద చేస్తున్న పనులు

సాక్షి ఎఫెక్ట్..

వర్ని: (మోస్రా): గుంతలమయంగా మోస్రా రోడ్డు శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిలిచిపోయిన రోడ్డు పనులను సోమవారం కాంట్రాక్టర్ ప్రారంభించారు. రోడ్డుపై గుంతలను పూడ్చివేశారు. రోడ్డుపై దుమ్ము లేవకుండా నీటితో క్యూరింగ్ చేశారు. రోడ్డు పనులను 15 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

వెల్మల్-ఆలూర్ బ్రిడ్జి వద్ద మొరం పోసిన వీడీసీ



వెల్మల్-ఆలూర్ బ్రిడ్జి వద్ద మొరం పోయించిన వీడీసీ సభ్యులు, నాయకులు

నందిపేట్(ఆర్మూర్): ప్రమాదంలో వెల్మల్-ఆలూర్ బ్రిడ్జి కథనానికి నందిపేట మండలం వెల్మల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు స్పందించారు.సోమవారం వీడీసీ ఆధ్వర్యంలో బ్రిడ్జి వద్ద మొరం పోయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జికి ఆనుకుని పోసిన మొరం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కోతకు గురైన బ్రిడ్జి పక్కనే రోడ్డుపై మట్టిని పోయించారు. అయిలాపూర్ సొసైటీ చైర్మన్ సుదర్శన్, శ్రీధర్, వెల్మల్ వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను ఖాళీ చేయించిన అధికారులు



మోర్తాడ్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనుమతి లేకుండా ఉన్నవారిని బయటకు పంపిస్తున్న అధికారులు

మోర్తాడ్: మోర్తాడ్‌లో పంపిణీ చేయకుండా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనుమతి లేకుండా ఉన్న వారిని గుర్తించి బయటకు పంపించి ఇళ్లకు సీల్ వేశారు. సోమవారం తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో తిరుమల, ఎస్సై రాము ఆధ్వర్యంలో 69 ఇళ్లలో ఉన్నవారిని గుర్తించారు. వారికి మంజూరు పత్రాలు లేకపోవడంతో ఖాళీ చేయాలని అధికారులు సూచించారు. అర్హులకు త్వరలోనే పంపిణీ చేసే కార్యక్రమం ఉంటుందని అప్పటి వరకూ ఇళ్లకు సీల్ వేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. దీంతో కొంత మంది అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనుమతి లేకుండా ఉండటం నేరమని చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారు.

ఈవ్ టీజింగ్ చేస్తే సమాచారం ఇవ్వాలి



వెల్మల్ గ్రామంలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న షీటీం సభ్యులు, టీచర్లు

నందిపేట్(ఆర్మూర్):మహిళలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా,ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా షీటీంకు సమాచారం అందించాలని సబ్ డివిజన్ షీటీం అధికారులు విఘ్నేష్, సుమతిలు అన్నారు. మండలంలోని వెల్మల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం సైబర్ క్రైంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు.బాధితు లు సెల్ నంబరు 8712659795కు గాని డయల్ 100 నంబరుకు గాని సమాచారం ఇవ్వాలని సూ చించారు.క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం షీటీం కరపత్రాలను ప్రదర్శించారు. హెచ్ ఎం కె. గంగాధర్, హెడ్‌కానిస్టేబుల్ వసంతరావు, నందిపేట పోలీస్ సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని పలు గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు 15 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌రెడ్డిలు మాట్లాడుతూ వార్డులలో ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీరు చెత్త చెదారం దోమలకు ఆవాసాలుగా మారుతున్నందున పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీవో లక్ష్మిప్రసాద్, హెల్త్ సూపర్‌వైజరు భాస్కర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోటీకి అర్హత కల్పించాలని వినతి

నవీపేట: ముగ్గురు అంతకన్నా ఎక్కువ సంతానం కలిగిన వారికి స్థానిక ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని నవీపేట మాజీ వార్డు సభ్యులు గుత్తి సాయిలు సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం ముగ్గురు సంతానం కలిగిన వారిని ఎన్నికలలో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తూ వెలువరించిన జీఓను రద్దు చేయాలని కోరారు. తన వినతిని ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం..

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో బైపాస్ రోడ్డు పక్కన మురుగు కాలువ ప్రమాదకరంగా ఉంది. బైపాస్ రోడ్డు పక్కన రోడ్డుకు అనుకుని లోతైన మురుగు కాలువ ఉంది. అక్కడ కనీసం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్ట లేదు. మురికి కాలువను నిర్మించి, దానిపై కప్పు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించాలి.



ముప్కాల్ మండలం కొత్తపల్లిలో ప్రమాదకరంగా ఉన్న మురుగు కాలువ

గుంతలను పూడ్చాలి



ఆర్మూర్ శివారులోని దార్ల హనుమాన్ సమీపంలో రోడ్డు మధ్యలో గుంత

ఆర్మూర్‌టౌన్: పట్టణం నుంచి నందిపేట్ వెళ్లే దారిలో పట్టణ శివారు దార్ల హనుమాన్ సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారింది. రాత్రి సమయంలో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



రుద్రూర్: పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు సోమవారం ఎస్సై సాయన్న అందజేశారు.శుక్లా వివేక్ కుమార్, నమ్మి, గంగాధర్, చింతల లింగమ్మలు ఇటీవల ఫోన్లను పోగొట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఈఫోన్లను గుర్తించి పోలీసులు రికవరీ చేశారు. సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై మురుగునీరు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ పక్కన మురుగునీరు రోడ్డుపై పారుతుంది. దీంతో రోడ్డుపై వెళ్లే పాదాచారులు, వాహనదారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు మురుగునీరు పారుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపై పారకుండా చూడాలన్నారు.



నిజాంసాగర్ కెనాల్ సమీపంలో రోడ్డుపై పారుతున్న మురుగు

బీసీ వ్యతిరేక పార్టీ బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవీపేట : బీసీ వ్యతిరేక పార్టీ బీజేపీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజా సంఘాల ఐక్యవేదికలో నాయకులు తీర్మానించారు. మండల కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డెన్ లో జరిగిన ఐక్యవేదికలో నాయకులు మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ అడ్డుకట్ట వేస్తుందని విమర్శించారు. ప్రజా సంఘాలను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ నాయక్ వాడి శ్రీనివాస్, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు వడ్డెన్న, వసంత్, రైతు సంఘం జిల్లా నాయకులు దేవేందర్ సింగ్, మహిళా సంఘం నాయకురాలు రమాదేవి తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్సై చందర్

బోధన్ : ఎడపల్లి మండలంలోని ధర్మారంలో సోమవారం ఎస్ బీఐ సౌజన్యంతో విడ్స్(వలంటీర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్ మెంట్ సొసైటీ) అధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అంశంపై మహిళ పొదుపు సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ నిజామాబాద్ సీఎఫ్ ఎల్ కౌన్సిలర్ పవన్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ బీమా పథకాల ప్రాముఖ్యత,బ్యాంక్ ఆర్థిక లావాదేవీలపై జాగ్రత్తలను వివరించారు. ఎడపల్లి ఏఎస్సై చందర్ సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.